# Press Clippings appeared on 29.04.2017

# Namasthey Telangana

# దేశ విజయరథం 'ఈసీఐఎల్'



ఈసీఐఎల్‌లో పరిశోధనల్లో నిమగ్నమైన శాస్త్రవేత్తలు

ఈసీఐఎల్ లోగో

**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దూసుకుపోయే క్షిపణులు, విమానాల కాక్‌పిట్ వాయిస్ రికార్డర్లు, అణువిద్యుత్‌ను సృష్టించే రియాక్టర్లు, రేడియేషన్‌ను గుర్తించే డిటెక్టర్లు, వినోదాలు పంచే టీవీలు, వైద్యచికిత్సకు ఉపకరణాలు, ఈవీఎం మెషిన్లు ఇలా ఎన్నో రంగాల్లో ఉపయోగించే వివిధ రకాల ఎలక్ట్రానిక్ ఉపకరణాలనెన్నింటినో అందించిన ఘనత ఈసీఐఎల్ సొంతం. అయిదు వసంతాల ప్రగతి పథంలో దేశాభివృద్ధికి ఎనలేని సేవలందించిన ఈసీఐఎల్ 50 వసంతాల మైలురాయిని దాటిన సందర్భంగా అయిదు పదుల విజయాలను మరోమారు గుర్తుచేసుకుందాం!

అటామిక్ ఎనర్జీ కమిషన్‌కు అనుబంధంగా ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తయారుచేసే సంస్థను ప్రభుత్వ యాజమాన్యంలో ప్రారంభించాలని ప్రఖ్యాత అణు శాస్త్రవేత్త డాక్టర్ హోమీజహంగీర్ బాబా భావించారు. అణు విద్యుత్ ఉత్పాదన, దేశ రక్షణ కోసం విదేశాలపై ఆధారపడకుండా ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ, అభివృద్ధి, పరిశోధనలో పురోగతిని సాధించాలని కేంద్రప్రభుత్వం కూడా నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్).. 1967 ఏప్రిల్11న ఆవిర్భవించింది.

**అప్సర సృష్టి**

అణు ఇంధనశాఖకు అనుబంధంగా భారత ప్రభుత్వం ఈసీఐఎల్‌ను స్థాపించింది. ఎలక్ట్రానిక్ రంగంలో దేశానికి అవసరమైన పరిశోధన, ఆవిష్కరణ, అభివృద్ధి, తయారీ, సరఫరా, పర్యవేక్షణ, సాధికారత కోసం ఈ సంస్థను నెలకొల్పారు. ప్రారంభించిన కొద్ది కాలానికే ఈసీఐఎల్ పరిశోధకులు సాలిడ్ స్టేట్ బ్లాక్అండ్‌వైట్ టీవీ 'అప్సర'ను ఆవిష్కరించారు.

**అమ్ములపొదికి అండగా..**

పౌర విమానాలు, యుద్ధ విమానాల నిర్వహణకు కావాల్సిన కమ్యూనికేషన్ ఉపకరణాల తయారీ ద్వారా భారత రక్షణకు ఈసీఐఎల్ తోడ్పాటునందించింది. ఆ తర్వాత కాలంలో సరిహద్దు దళం, నావికాదళం, వాయుసేన అమ్ముల పొదిలో సరికొత్త ఆయుధాలు పొదిగేందుకు కావాల్సిన సాంకేతిక సహకారాన్ని ఈసీఐఎల్ అందించడంతో రక్షణశాఖలోని డీఆర్‌డీఏ ప్రయోగాలన్నీ విజయవంతమయ్యాయి.

**విద్యుల్లతకు పందిరి**

అణువిద్యుత్ ఉత్పత్తి యూనిట్లలో ఉపయోగించే రక్షణ పరికరాలు, రేడియేషన్ నిర్వహణ, సేఫ్టీ సిస్టమ్స్‌ను ఈసీఐఎల్ తయారు చేస్తుంది. అణుశక్తి నుంచి మనుషులకు, పర్యావరణానికి పొంచిఉండే ప్రమాదాన్ని నివారించే రేడియేషన్ డిటెక్టర్లను, న్యూట్రాన్లను గుర్తించే డిటెక్టర్లను అభివృద్ధి చేసి, అణు విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేస్తున్నది.

## ఈసీఐఎల్ స్ఫూర్తిప్రదాత

ఈసీఐఎల్‌ను నడిపేందుకు డాక్టర్ హోమీజహంగీర్ బాబాడాక్టర్ ఏఎస్ రావుని సమర్థుడిగా భావించి ఆయనకు సంస్థ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈసీఐఎల్ స్థాపించాలనే నిర్ణయం తీసుకునే సమయానికి ఏఎస్‌రావు.. బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)లో ఎలక్ట్రానిక్ విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నారు.



## అగ్రదేశాలకు తీసిపోం

ఈసీఐఎల్ క్లిష్టమైన సమస్యలన్నింటికీ సాంకేతికంగా పరిష్కార మార్గాలు చూపించడంలో విజయవంతమైనది. సాంకేతిక రంగంలో అగ్రదేశాలకు భారత్ ఏమాత్రం తీసిపోదని నిరూపించాం.

– దేబాశిష్ దాస్,
ఈసీఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్